రైతులకు చేరిన బీజీ-3


టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బీజీ-3 విత్తనాలు (ఫైల్)



● టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినా వెనక్కు తగ్గని అక్రమ వ్యాపారులు
● కళ్లుగప్పి యథేచ్ఛగా విక్రయాలు
● విత్తడం పూర్తయ్యాక పట్టుకున్న అధికారులు
● అవగాహన కల్పించడంలో విఫలం
● వర్గల్, రాయపోల్ మండలాల్లో బీజీ-3 సాగు

భూసారమే రైతుకు దన్ను.. అది లేకపోతే ఆరుగాల కష్టం వృథానే.. కానీ అవగాహన లేక రైతు తన భూమిలోనే విషం నాటుతున్నాడు.. అవగాహన కల్పించాల్సిన అధికారులు మొద్దునిద్ర పోతుండడంతో జరగరాని ఘోరం జరిగిపోయింది. భూమికి విషతుల్యంగా భావించే బీజీ-3 పత్తి విత్తనాలను రైతులు సాగుచేస్తున్నారు..!!

గజ్వేల్, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ అధికారుల కళ్లుకప్పి యథేచ్ఛగా బీజీ-3 విత్తనాలను విక్రయించారు. బీజీ-3 విత్తనాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఓ వైపు పర్యావరణ శాస్త్రవేత్తలు, అధికారులు మొత్తుకుంటున్నా రైతులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ విషయం పై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించారు. దీం తో జిల్లాలోని వర్గల్, ములుగు, రాయపోల్, గజ్వేల్ మండలాల్లోని పలు గ్రామాల్లో బీజీ-3 పత్తిని రైతుల సాగు చేశారు. బీజీ-3 విత్తనాల అమ్మకాలపై నిఘా పెట్టాల్సిన అధికారులు సొంత పనులపై దృష్టిసారించడంతో అక్రమ వ్యాపారులు యథేచ్ఛగా విక్రయాలను చేపట్టారు. సీజన్ ముగింపు దశలో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు బీజీ-3 విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు.

బీజీ-3 విత్తనాలకు అడ్డాగా గ్రామాలు

సిద్దిపేటజిల్లా వర్గల్ మండలం బొర్రగూడెం, గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ అడ్డాగా బీజీ-3 వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగిందని పలువురు రైతులు చెబుతున్నారు. బొర్రగూడెం అడ్డాగా రాయపోల్, వర్గల్ మండలాల్లోని గ్రామాల్లో.. బంగ్లావెంకటాపూర్ అడ్డాగా రాయపోల్ మండలంతో పాటు తూప్రాన్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన రైతులకు బీజీ-3 విక్రయించినట్లు తెలుస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి పలువురు వ్యక్తులు బీజీ-3 విత్తనాలను తీసుకొచ్చి రైతులకు విక్రయించారు. బీజీ-3 విత్తనాల వలన కలిగే నష్టాలను గూర్చి రైతులకు వివరించడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారు. రైతు వేదికలు, గ్రామసభలు పెట్టి అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవరించారు. దీంతో రైతులు సైతం బీజీ-3పై ఆసక్తి కనబరిచినట్లు తెలుస్తుంది. బీజీ-3 విత్తనాలలో గ్లైసెల్ కలిగి ఉండడంతో భూసారం పూర్తిస్థాయిలో దెబ్బ తింటుందని చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకున్నా విక్రయాలు చేపట్టారు. రైతులు సైతం కలుపు నివారణకు ఇదే ఉత్తమ మార్గంగా భావిస్తుండగా, గత నాలుగైదేళ్లుగా ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడులు రాకున్నా రైతులు మాత్రం బీజీ-3 సాగుపై ఆసక్తి కనబరిచారు.



టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన అక్రమ వ్యాపారులు

అక్రమంగా బీజీ-3 విత్తనాలను విక్రయించిన పలువురిని ఇటీవల సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. బొర్రగూడెంలో ముగ్గురిని, బంగ్లావెంకటాపూర్‌లో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంగ్లావెంకటాపూర్‌కు చెందిన వ్యక్తి నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు గజ్వేల్‌లో 108 కేజీలు(225 ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకున్నారు. వర్గల్ మండలం బొర్రగూడెంకు సంబంధించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 12 కేజీలు (27 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు, స్థానిక వ్యవసాయాధికారులు ఈ విషయంపై దృష్టి సారించకపోవడం విడ్డూరం.

మీ సేవ.. మరింత చేరువ

● మహిళా శక్తి పథకం కింద అమలు
● గ్రామైక్య సంఘాలకు నిర్వహణ బాధ్యతలు
● ఇంటర్ చదివిన మహిళలకు కేటాయింపు
● జిల్లాకు 29 కేంద్రాలు మంజూరు



సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 9 : జిల్లాలో పౌరసేవలను మరింత సులభతరం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గ్రామాల్లో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మహిళా శక్తి పథకం కింద జిల్లాలోని మొత్తం 29 మీసేవ కేంద్రాలను మంజూరు చేసింది. అయితే వీటి నిర్వహణ పూర్తిగా ఆయా గ్రామైక్య సంఘం పరిధి ఎస్‌హెచ్‌జీ గ్రూపులోని సభ్యురాలికి మాత్రమే అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇంటర్ పాస్ అయిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఒక దరఖాస్తు మాత్రమే వస్తే వారినే ఎంపిక చేయనుండగా ఒకటికి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే మాత్రం సంబంధిత గ్రామైక్య సంఘం తీర్మానం మేరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

గ్రామపంచాయతీల్లో ఏర్పాటు...

మహిళా శక్తి మీసేవ కేంద్రాలను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భవనాలు, గ్రామపంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, రైతువేదికలు వీటిలో ఏది అనుకూలంగా ఉంటే అందులో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపికైన లబ్ధిదారులకు సంబంధిత గ్రామైక్య సంఘం ద్వారా రూ. 2.50 లక్షల రుణ సౌకర్యం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆందోళనలో మీసేవా నిర్వాహకులు

ప్రభుత్వం కొత్త మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తుండడంతో ఇప్పటికే మీసేవా సెంటర్లను నిర్వహిస్తున్న నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని సగం మీ సేవా కేంద్రాలు సరిగా నడవడం లేదు. పనులు లేక నష్టాల్లో కాలం వెళ్లదీస్తున్నామని, ఈ తరుణంలో మరిన్ని మీ సేవా సెంటర్లు ఏర్పాటయితే తమ జీవనోపాధి దెబ్బతింటుందని వాపోతున్నారు.

29 మీ సేవ కేంద్రాలకు అనుమతి



జిల్లాలో 29 మహిళా శక్తి మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే ఈ కేంద్రాల ఏర్పాటు పూర్తిగా ఆయా గ్రామైక్య సంఘం పరిధిలో కొనసాగుతుంది. లబ్ధిదారుల ఎంపిక సంబంధిత వీవో తీర్మానం మేరకే జరుగుతుంది. వారం రోజుల్లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం.

- జయదేవ్ ఆర్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

విన్యాసాలు చేస్తూ బైక్ నడిపిన ముగ్గురిపై కేసు

చిన్నకోడూరు, జూలై 9 : విన్యాసాలు చేస్తూ బైక్ రైడ్ చేసిన ముగ్గురు యువకుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేటకు చెందిన పవన్, ప్రణీత్, సాయికృష్ణ స్నేహితులు. ఈ ముగ్గురు కలిసి ఈనెల 7న సాయంత్రం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు కట్టపై బైక్‌ను మితిమీరిన వేగంతో నడుపుతూ విన్యాసాలు చేసి సందర్శకులను భయభ్రాంతులకు గురి చేశారు. అదే సమయంలో పెట్రోలింగ్ వచ్చిన పోలీసులను చూసి యువకులు పరారయ్యారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. మంగళవారం వారి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


దుబ్బాకలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మీ ఆశీర్వాదంతోనే ఈస్థాయికి..

● ప్రతి కష్టంలో నిలబడ్డారు.. నిలబెట్టారు
● ప్రశ్నించే గొంతుగా బతికించారు : ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, జూలై9: దుబ్బాక ప్రజలు మొదటి నుంచి అండగా నిలబడి, తనను ఈ స్థాయికి తీసుకొచ్చారని, దుబ్బాకనే తన శ్వాస అని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ప్రతి కష్టంలో అండగా నిలబడి, తనను గొప్పస్థాయిలో నిలబెట్టారని ఆయన తెలిపారు. మంగళవారం దుబ్బాకలో జరిగిన ఓటర్ల కృతజ్ఞత సభలో రఘునందన్‌రావు మాట్లాడారు. డబ్బులు పంచి గెలవలేమని దుబ్బాక ప్రజలు మరోసారి నిరూపించారని, ఇతర పార్టీల వారు ఓటుకు రూ.వెయ్యి, రూ.2వేలు పంచినా కూడా ఒక్కపైసా ఇవ్వని తనకు ఓటు వేసి గెలిపించారన్నారు. తాను డబ్బులు పంచి ఎన్నడూ దుబ్బాకలో గెలవలేదని, తనను 2001 నుంచి ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. ప్రజలకు సేవచేస్తాననే నమ్మకంతో, ప్రశ్నించే గొంతును బతికించాలనే కసితో తనను గెలిపించారన్నారు. దుబ్బాక, సిద్దిపేట తనకు జన్మభూమి అయితే, సంగారెడ్డి, పటన్‌చెరు కర్మభూమి అని ఆయన స్పష్టం చేశారు. దుబ్బాక అభివృద్ధికోసం తాను తుదిశ్వాస వరకు పోరాడుతానన్నారు. అలాగే ఆయన దుబ్బాకలోని బాలాజీ వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు వడ్లకొండశ్రీధర్, చింతరాజులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పౌరోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు బాలేష్‌గౌడ్,కానుగంటి శ్రీనివాస్, మట్టమల్లారెడ్డి, వెంకట్‌గౌడ్, సుబాష్‌రెడ్డి, ఎస్ఎన్‌చారి, విబీషన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

అవెన్యూ ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు చేయాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 9: నేషనల్ హైవేపై అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మిట్టపల్లి నుంచి జిల్లా పరివాహక ప్రాంతం వరకు అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు విషయమై సంబంధిత అధికారులతో ఆమె సమావేశమయ్యారు. మిట్టపల్లి నుంచి జిల్లా పరివాహక గ్రామాల వరకు సుమారు 14 గ్రామాల్లో నేషనల్ హైవే నిర్మాణం పూర్తయిందని గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. ఆ రోడ్డు వెంబడి దాదాపు 14వేల మొక్కలు నాటేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన ప్రాంతాన్ని మొత్తం ఒకసారి పరిశీలించాలని డీఆర్డీఏ, ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు వారి పరిధిలోని రహదారి వెంబడి మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా గ్రామపంచాయతీ అధికారి దేవకీ దేవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో సీజనల్ వ్యాధులు, డయేరియా, డెంగీ, ఇతరత్రా వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించగా పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

దశాబ్దాలుగా మారని పెద్దచెరువు దశ

● 2001లో ఎత్తిపోతలకు శ్రీకారం
● అప్పటి నుంచి ముందుకు సాగని పనులు
● పలుమార్లు ప్రతిపాదనలు
● నిధులు విడుదల చేస్తేనే పనులు పూర్తి

దుబ్బాక, జూలై 9 : సిద్దిపేట పాత డివిజన్‌లోనే అతి పెద్ద చెరువు.. ఆ చెరువుకు ఎంతో చరిత్ర ఉంది. ఐదు ఊర్ల జనానికి అదరువుగా ఉండే అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట పెద్దచెరువు 2001 నుంచి పునరుద్ధరణకు ఆమడ దూరంలో నిలిచింది. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. చెరువు రూపురేఖలు మాత్రం మారడం లేదు. ఫలితంగా పోతరెడ్డిపేట, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి, నగరం, తాళ్లపల్లి, మెదక్ జిల్లా పెద్దనిజాంపేట మండలం కల్వకుంట గ్రామప్రజలకు నిరాశ తప్పడం లేదు. తలాపునే కూడవెల్లి వాగు ఉండడంతో దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోతరెడ్డిపేట పెద్ద చెరువుకు మొదటి ఎత్తిపోతల పథకం కింద శ్రీకారం చుట్టారు. 2001లో ఎత్తిపోతల పథకం ద్వారా పెద్దచెరువును నింపేందుకు రూ.3కోట్లను మంజూరు చేశారు. రామేశ్వరంపల్లి శివారు నుంచి సుమారు 4 కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి రామేశ్వరపల్లి వాగు ఒడ్డున 33-11 కేవీ సబ్‌స్టేషన్‌ను కూడా నిర్మించారు. అయితే కరెంటు వ్యయం పెరగడంతో నిర్వాహణ కష్టమైంది. 2004లో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ బండినర్సాగౌడ్ కలిసి సమస్యను విన్నవించారు. అప్పటి కలెక్టర్‌గా ఉన్న బుర్రవెంకటేశంగౌడ్ పలుమార్లు పర్యవేక్షించి పెద్ద చెరువుకు చిన్నవాగు ద్వారా నేరుగా నీటిని మళ్లించాలనే ప్రతిపాదన చేసి ప్రభుత్వానికి పంపారు. అయినా, పనులు ముందుకు సాగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి చెరువు పునరుద్ధరణకు నడుంబిగించారు. మంత్రి హరీశ్‌రావు కృషితో రూ.3కోట్ల నిధులను మంజూరు చేయించారు. మెదక్ జిల్లా పెద్దనిజాంపేట మండలం కల్వకుంట నుంచి 6 కిలోమీటర్ల మేర కాలువను ఏర్పాటు చేయాల్సి ఉండడంతో కొంత జాప్యం జరిగింది. భూసేకరణలో రెండు జిల్లాల అధికారుల సమన్వయలోపంతో అప్పుడు కూడా పనులు జరగలేదు. రూ.2.15 కోట్లను భూసేకరణకు వినియోగించి మిగిలిన నిధులను వివిధ పనులకు ఉపయోగించారు. మరిన్ని నిధులు కేటాయించకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి.


శిథిలావస్థలో చెరువు తూం


పూడుకుపోయిన మత్తడి


పోతరెడ్డిపేట పెద్దచెరువు

ఈ ప్రభుత్వమైన కనికరించేనా?

అసంపూర్తి పనులను పూర్తిచేయడానికి రూ.9 కోట్ల వరకు అవసరం అవుతాయి. చెరువును బలీష్టం చేయడానికి సుమారు 20 ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. అందుకు మరో కోటిన్నర, కాలువ పనులకు రూ.2కోట్లు అవసరమవుతాయి. చెరువుపై వివిధ అభివృద్ధి పనులకు గాను17 నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. మొత్తంగా రెండు మత్తళ్లు, మూడు తూములు, 6 కల్వర్టులు, రెండు బ్రిడ్జిలు అవసరమవుతాయి. రూ.30 లక్షలతో చిన్నవాగు చెక్‌డ్యాం ఎత్తు పెంచడంతో పాటు గేట్ల నిర్వాహణకు రూ.20 లక్షల వరకు అవసరం. చెరువు కట్టపై గల మూడు తూములు, రెండు మత్తడుల అభివృద్ధికి రూ.కోటి పైచిలుకు నిధులు అవసరమవుతాయి. 2022లో ఆర్థికశాఖ నుంచి అనుమతి లభించినప్పటికీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. అప్పటి ప్రభుత్వం దీనికి నిధులను మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన స్పందించి పెద్దచెరువును దశను మార్చాలని రైతులు కోరుతున్నారు.

ఎరుకజెప్పిన ఎలుక..!

● సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో సమస్యల తిష్ట
● మొన్న కుళ్లిన కూరగాయలు.. తాజాగా చట్నీలో ఎలుక
● నాణ్యత లేని ఆహారం.. శుభ్రత లేని మెస్‌లు
● పట్టించుకోని యంత్రాంగం.. తీరు మార్చుకోని అధికారులు
● అర్ధాకలితో చదువు పక్కదారి పడుతున్నదని విద్యార్థుల మొర
● విచారణాధికారుల ఎదుట ఫిర్యాదుల వెల్లువ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 9: ప్రతిష్టాత్మకమైన జేఎన్‌టీయూ విద్యాసంస్థ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నది. హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై నిరంతరం నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం టిఫిన్‌లోకి తయారు చేసిన పల్లి చట్నీలో ఎలుక ఈత కొడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ మాధురి, హైదరాబాద్ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి సదరు చట్నీని ప్రత్యక్షంగా పరిశీలించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో విచారణ చేపట్టగా కళాశాల హస్టల్‌లో దారుణ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. వర్ణణాతీతమైన విద్యార్థుల బాధలు వెలుగుచూశాయి. తాము ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని.. నేడు ఎలుక కారణంగానైనా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందని విద్యార్థులు వాపోయారు.

1,400 మంది విద్యార్థులు

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను 2014లో ప్రారంభించారు. ప్రస్తుతం బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులను నిర్వహిస్తున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరు హాస్టళ్లు, వేర్వేరు మెస్‌లు ఉన్నాయి. దాదాపు 1,400 మంది విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. బోధనలో మంచి మార్కులే పడుతున్నా ఆహార విషయంలో అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అపరిశుభ్రం.. అస్తవ్యస్తం

హాస్టల్ మెస్‌లు అపరిశుభ్రంగా ఉన్నట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. పది రోజుల క్రితం ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేపట్టిన తనిఖీల్లోనూ విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. కాలం చెల్లిన మైదా, పాడైన కూరగాయలను వినియోగిస్తున్నట్టు గుర్తించి వాటిని పారబోయించారు. కిచెన్, పాత్రలు కడిగే ప్రదేశంలో శుభ్రత దారుణంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేశారు. పది రోజుల్లోనే మరోసారి విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. విద్యార్థులకు ఉదయం అల్పాహారంలోకి ఇచ్చే పల్లి చట్నీ పాత్రలో ఎలుక పడిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. చట్నీపాత్రలో ఎలుక చక్కర్లు కొడుతున్న వీడియోలు వెలుగులోకి రావడంతోనే అందరి దృష్టి పడిందని విద్యార్థులు వాపోతున్నారు. మెస్ కాంట్రాక్టర్, కేర్ టేకర్లు, వంట సిబ్బంది నిర్లక్ష్యంతో పరిస్థితి ఇలా రోజురోజుకూ దారుణంగా మారుతున్నదని వారు ఆరోపిస్తున్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, నాణ్యతలేని సరుకులతో ఆహారం వండుతున్న విషయంపై కాలేజీ అధికారులు, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోతున్నారు.

ఫిర్యాదు చేస్తే పనిష్మెంట్!

జేఎన్‌టీయూలో సమస్యలను చెప్పుకోలేని వాతావరణం ఉన్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. మెస్ నిర్వహణ, హాస్టల్‌లో వసతులు, నాణ్యతలేని భోజనం గురించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే సదరు విద్యార్థులపై కక్షసాధింపుకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. క్యాంపస్‌లో పరిస్థితిపై విద్యార్థులను కదిలించగా.. పలువురు తమ గోడు వెల్లబోసుకున్నారు. కానీ, తమ పేర్లు గోప్యంగా ఉంచాలని, లేదంటే అకాడమిక్ పరంగా ఇబ్బందులు పెడతారని వేడుకున్నారు. సమస్యల గురించి ఎవరైనా మాట్లాడితే పనిష్మెంట్ తప్పదని వారు వాపోయారు. అందుకే అన్నం వాసన వచ్చినా, మధ్యాహ్నం వండిన అన్నాన్ని రాత్రి వడ్డించినా, చికెన్ ఉడకకున్నా, మజ్జిగ, సాంబారు నీళ్లలా ఉన్నా భరిస్తున్నామని విద్యార్థులు చెప్పారు. కానీ, ఆకలి బాధతో చదువుపై దృష్టిపెట్టలేకపోతున్నామని పలువురు 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.


పల్లి చట్నీ పాత్రలో తిరుగుతున్న ఎలుక

అడిషనల్ కలెక్టర్ తనిఖీ

జేఎన్‌టీయూ ప్రాంగణాన్ని మంగళవారం సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ మాధురి తనిఖీ చేయగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కాలేజీ హస్టళ్లను, మెస్‌లను ఆమె పరిశీలించారు. అపరిశుభ్ర పరిస్థితులను చూసి కేర్ టేకర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేర్వేరుగా అమ్మాయిలు, అబ్బాయిలతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. అదేవిధంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులకూ ఫిర్యాదు చేశారు. వారు విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా పోటీపడి తమ సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు.

ఆరుబయట వంట.. ఎన్నాళ్లు ఈ తంటా..!

● ప్రభుత్వ బడులలో వంట గదులు లేక ఇబ్బందులు



కోహీర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని వరండాలో వంట వండుతున్న దృశ్యం

కోహీర్, జూలై 9: కోహీర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గదులు లేక నిర్వాహకులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా చాలాచోట్ల వంట గదులు లేని పరిస్థితి. ఉపాధిహామీ నిధులు కేటాయించినా.. గదుల నిర్మాణంలో పురోగతి లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాఠశాల ఆవరణలో వంట చేయడంతో తరగతి గదుల్లోకి పొగ చూరి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. కోహీర్ మండలంలో 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 28 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,0124 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే గతంలో పాఠశాలల వంట గదుల నిర్మాణాలకు ఉపాధిహామీ నిధులను మంజూరు చేసింది. అప్పట్లో కొన్ని పాఠశాలలో వంట గదులు నిర్మించినా.. అవి వంటలు చేసేందుకు అనుకూలంగా లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. మిగతా పాఠశాలలో నిర్మించకపోవడంతో ఆరుబయటనే వండుతున్నారు. కొన్ని పాఠశాలల్లో చెట్ల కిందనే చేపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని పాఠశాలల్లో వంట గదులను నిర్మించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి

● నిబంధనల ప్రకారం ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

సంగారెడ్డి అర్బన్, జూలై 9: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వనమహోత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, ఉద్యోగుల బదిలీలు తదితరల అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకుపైగా మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. జిల్లాలవారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను నాటాలని, ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఆశా, ఎఎన్ఎం, సిబ్బంది క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల్లో పూర్తి కాని పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. 20లోగా నిబంధనలు పాటిస్తూ ఉద్యోగుల బదిలీలు పూర్తిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజరాణి, డీఆర్‌డీవో జ్యోతి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డీఎఫ్‌వో శ్రీధర్, డీపీవో సాయిబాబ, డీఈవో వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

ఎల్లమ్మ దీవెనలతో సుభిక్షంగా ఉండాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తి, జూలై 9: రేణుకాఎల్లమ్మ దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ బోనాలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని, ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని వారు సూచించారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బోనాలను డప్పువాయిద్యాలతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆటాపాటలు, డీజే చప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలు, నృత్యాలు చేస్తూ బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలు

రేగోడు, జూలై 9: ఆషాఢమాసం పురస్కరించుకొని రేగోడు మండలం చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలు తీశారు. గ్రామంలోని పోతురాజుల నృత్యాలు, బ్యాండ్ మేళాలతో ఆలయానికి బోనాలను సమర్పించారు.



రేగోడులో బోనాలు తీస్తున్న మహిళలు



బోనాల ఊరేగింపులో రాజిరెడ్డి



ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

నంగునూరు, జూలై 9: విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దని, చదువుపై దృష్టిసారించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. మంగళవారం నంగునూరు మండలం నర్మెట హైస్కూల్‌లో నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాగి చక్కెర కర్మాగారం సీడీసీ చైర్మన్‌గా శాదుల్



శాదుల్

నారాయణఖేడ్, జూలై 9: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం పరిధిలోని మాగి గాయత్రి షుగర్స్ లిమిటెడ్ కెన్ డెవలప్‌మెంట్(సీడీసీ) చైర్మన్‌గా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం జంగి.బి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ.శాదుల్‌ను నియమిస్తూ షుగర్ కెన్ కమిషనర్ డాక్టర్ జి.మల్సూర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శాదుల్ సీడీసీ చైర్మన్‌గా మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. సీడీసీ కమిటీలో చైర్మన్‌గా శాదుల్, కంపెనీ ప్రతినిధులు వేణుగోపాల్‌రావులను నియమిస్తూ ప్రొసీడింగ్ నెం.ఎం/216/2024 ద్వారా ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శాదుల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, నారాయణఖేడ్, జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, లక్ష్మీకాంతారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను మాగి చక్కెర కర్మాగారం పరిధిలోని చెరకు రైతుల అభివృద్ధి, సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని వివరించారు.

బాలిక మృతి కేసులో పలువురికి రిమాండ్

వెల్దుర్తి, జూలై 9: మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామానికి చెందిన కౌడె పావని మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పలువురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవతాగౌడ్ మంగళవారం తెలిపారు. శేరి గ్రామానికి చెందిన కౌడె శ్రీనివాస్, యాదమ్మ కూతురు పావనిని నానమ్మ కౌడే బాలమ్మ, మేనత్త మంజులలు తీవ్ర దుర్భాషలాడడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పావని మే 22న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పావని మృతికి కారణమైన నానమ్మ, మేనత్తలతో పాటు వారిని కొట్టిన మరో ఐదుగురు చేకూరి రమేష్, కుర్మ మహిపాల్, కౌడే యాదగిరి, కౌడే కొమురయ్య, కౌడే చిన్న మల్లయ్యలపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మునిపల్లి, జూలై 9: మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. తహసీల్దార్ తెన్ మొళి, ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం... మునిపల్లి మండలం మొగ్దుంపల్లి గ్రామ శివారులోని 108 సర్వే నెంబర్‌లో గల భూమిలో అనుమతి లేకుండా సదాశివపేటకు మట్టి తరలిస్తున్నారన్న సమాచారం వచ్చింది. రెండు టిప్పర్లను పట్టుకుని బుదేరా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో

కొల్చారం, జూలై 9: మండల పరిధిలోని సంగాయిపేట, రంగంపేట, తుక్కాపూర్, ఏటిగడ్డమాందాపూర్ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు మంగళవారం తనిఖీ చేశారు. వర్షాకాలంలో ప్రజలు తీసుకునే జాగ్రత్తల గురించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వర్షాలు పడకముందే రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో సుమారు 500 నుంచి 1000 ఆయిల్ బాల్స్ తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

మల్చింగ్ సాగు.. దిగుబడి బాగు

● పెట్టుబడి తక్కువ.. కలుపు సమస్యకు చెక్ ● కూరగాయలు, పండ్ల తోటల సాగుతో ప్రయోజనం



జహీరాబాద్ పరిధిలోని రంజోల్‌లో వంకాయ పంటలో వేసిన మల్చింగ్ షీట్

జహీరాబాద్, జూలై 9 : మారుతున్న కాలానుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఒంటబట్టించుకుని అధిక దిగుబడులు, లాభాలను సాధించేందుకు కొంతమంది రైతులు మొగ్గుచూపుతున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రాబట్టేందుకు వ్యవసాయాధికారుల సూచన మేరకు మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో మల్చింగ్ షీట్‌సాగు కొనసాగుతుండగా జహీరాబాద్ డివిజన్‌లోనే 300 ఎకరాల వరకు ఉంటుందని అధికారులు వివరించారు.

ప్రయోజనాలు

మల్చింగ్ షీట్ పొలంలో వేయడం మూలంగా నేల ఉపరితలాన్ని కప్పి ఉంచుతుంది. నేలలో తేమను కాపాడుతూ, కలుపు మొక్కల పెరుగుదలను నివారిస్తూ నేలపై ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. మొక్కల వేర్లు ఆరోగ్యంగా, దృఢంగా పెరుగడానికి దోహదపడుతుంది. వర్షపు నీరు నేరుగా భూమిపైన పడడంతో మట్టి కోతకు గురికాకుండా చేస్తుంది. మల్చింగ్ ప్లాస్టిక్ షీట్లను పరిచిన పొలాల్లో మొక్కలు ఎరువుల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటాయి. నేలల్లో సూర్యరశ్మి ధారాళంగా ప్రసరించి పంటల తెగుళ్ల వ్యాప్తికి కారణమయ్యే భూమిలో దాగి ఉండే క్రిమికీటకాలు, సూక్ష్మ జీవులు నశిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. మిరప, టమాట, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, కూరగాయలు, పండ్ల తోటలు, పూల మొక్కలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తే అధికదిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు.

సాగు విధానం

సాగు చేసే పంటకు సంబంధించి మొక్కల మధ్య దూరాన్ని బట్టి మల్చింగ్ ప్లాస్టిక్ షీట్లను పరవాల్సి ఉంటుంది. మిరప, టమాటా, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, తదితర పంటలను వేసే రైతులు 10 సెంటీమీటర్ల వెడల్పుతో 20 సెంటీమీటర్ల ఎత్తుతో వారి పొలాల్లో బోదెలను తయారు చేసుకోవాలి. ఆనంతరం డ్రిప్ పైపులైన్లను వేసుకుని బోదెలపై మల్చింగ్ షీట్లను వేసి పక్కభాగాల్లో మట్టితో కప్పివేయాలి. మల్చింగ్‌షీట్‌పై రెండు అంగుళాల (6 సెంటీమీటర్ల) దూరం రంధ్రాలు చేసి అందులో విత్తనాలు, లేదా మొక్కలను నాటాలి.

ఎకరాకు రూ.50 వేల ఖర్చు

మిరప, టమాట, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, తదితర పంటలకు మల్చింగ్ షీట్‌కు కలిపి రూ.50వేల పైచిలుకు ఖర్చు వస్తుంది. ఎకరాకు 12 వేల మొక్కలు అవసరం. మొక్క ఒక్కటి సుమారు రూ.2 కాగా రూ.24 వేలు ఖర్చు అవుతాయి. మల్చింగ్ షీట్‌కు రూ.14వేలు, ఎరువులకు రూ.12 వేలు అవసరం అవుతాయి. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడుతూ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటలు పండిస్తే ఎకరాకు సగటున 15 టన్నుల వరకు టమాటా, గోబీ, క్యాప్సికం దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఆదాయం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో రూ.50 వరకు పలుకుతుండగా, పుచ్చకాయ, కర్బూజ, క్యాప్సికం, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ ధరలుకూడ కాస్త అదే తరహాలో ఉన్నందున టన్నుకు రూ.60 వేల వరకు ఆదాయం వస్తుంది. దాదాపు ఎకరాకు రూ.8-9 లక్షల వరకు రాబడి ఉంటుంది. ఈ పంటలు కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే చేతికొస్తాయి.



మల్చింగ్ షీట్ విధానంలో పెరిగిన కూరగాయల మొక్కలు

ఈ ఏడాది కొత్తగా వేస్తున్నా



ఈ ఏడాది కొత్తగా మల్చింగ్ విధానంతో సాగుచేస్తున్నాను. మా పక్క పొలాలకు చెందిన రైతులు సాగు చేస్తుంటే చూసి, నాకు ఈ పద్ధతిని పాటించాలనే ఆసక్తి ఏర్పడింది. ప్రస్తుతం మూడు ఎకరాల్లో మల్చింగ్ విధానంతో టమాటా, గోబి పంటలను సాగు చేస్తున్నారు. ప్రారంభ సమయంలో కొంత మేర ఖర్చు అయినప్పటికీ ప్రస్తుతం మాత్రం ఉపయోగంగానే కనిపిస్తుంది.

- సయ్యద్ అహ్మద్, రంజోల్-జహీరాబాద్

లాభాలకు ఢోకా ఉండదు



ఏడాది పొడుగునా ఒక్కటే పంట పండిస్తే నష్టమే ఉంటుంది. మూడు పంటలను వేయాలి. కొద్దిగా కష్టపడి పెట్టుబడి పెడితే లాభాలకు ఢోకా ఉండదు. ప్రస్తుతం 8 ఎకరాల్లో దాదాపు రూ.5 లక్షల పెట్టుబడితో టమాటా పంట వేయగా, పూత దశలో ఉంది. అధికారుల సలహాలు పాటిస్తూ ముందుకెళుతున్నాం. లాభాలు వస్తాయని ఆశిస్తున్నాను.

- మైపాల్‌రెడ్డి, రంజోల్-జహీరాబాద్

మల్చింగ్ విధానంతో ప్రయోజనం



మల్చింగ్ షీట్ విధానంతో సాగుచేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. షీట్ కోసం రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జహీరాబాద్ ప్రాంత రైతులు ఆధునిక పద్ధతులతో వ్యసాయం చేయడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు. వారి ఆసక్తిని బట్టి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సందర్శనలు చేపట్టి సలహాలు, సూచనలు చేస్తున్నాం.

-శైలజ, ఉద్యానశాఖ అధికారి

సందేహాలను నివృత్తి చేస్తున్నా..



జహీరాబాద్ ప్రాంత రైతులు వాణిజ్య పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. సందేహాలు, సమస్యలుంటే రైతులు నన్ను సంప్రదిస్తుండగా ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాను. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తున్నాను. రంజోల్ రైతు వేదికలో నిత్యం అందుబాటులో ఉంటా. సరైన సూచనలతో రైతులకు మల్చింగ్ సాగు ఇబ్బందిగా అనిపించడం లేదు.

- ప్రదీప్‌కుమార్, జహీరాబాద్ ఏఈవో

కానరాని వాన జాడ.. ఎండుతున్న పంటలు

నర్సాపూర్, జూలై 9: అదనుదాటుతున్నా వర్షాలు ముఖం చాటేయడంతో నర్సాపూర్ డివిజన్‌లో రైతులు దిక్కుతోచకున్నారు. ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోయే దశకు చేరడంతో వరుణుడి కరుణ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. డివిజన్‌లోని నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాలుండగా ఒక్క చిలప్‌చెడ్ మండలంలో మాత్రమే గడిచిన నెలరోజులలో చెప్పుకోదగ్గ వర్షపాతం నమోదు అయింది. మిలిగిన మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. డివిజన్‌లో మేఘాలు కనిపించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తుండగా, చిరుజల్లులు తప్ప పెద్ద వర్షపు జాడ లేకపోవడంతో డీలా పడిపోతున్నారు. నర్సాపూర్ మండలంలో జూన్ నుంచి ఇప్పటివరకు 203.8 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 136.1 మిమీ నమోదైంది. కొల్చారంలో 165.6మిమీలకు 157.8మిమీ, కౌడిపల్లిలో 208మిమీలకు 164.9మిమీ, శివ్వంపేటలో 186.9మిమీలకు 151.7మిమీలతో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు ఇదే డివిజన్‌లోని చిలప్‌చెడ్ మండలంలో మాత్రం సాధారణ వర్షపాతం 211.2మిమీలకు 225మిమీల మేర నమోదై కాస్త మెరుగుగా ఉంది. ఈ వర్షాకాలం ఆశాజనకంగా ఉంటుందని డివిజన్‌లోని రైతాంగం జూన్ మాసంలోనే దుక్కులు దున్ని పంటలు వేసుకున్నారు. అయితే, ఆశించిన వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రుస్తుంపేట సమీపంలో వాడిపోయే దశకు చేరిన పంట



శివ్వంపేట సమీపంలో వాడిపోతున్న వరి



మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్బరీ సాగుతో రైతులకు ప్రయోజనం

జహీరాబాద్, జూన్ 9: మల్బరీ(పట్టు) సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో మంగళవారం సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ ములుగు వారి సౌజన్యంతో మల్బరీ(పట్టు) పంట సాగు విధానం, ప్రయోజనాలు, పెట్టుబడి, సబ్సిడీ తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ మల్బరీ(పట్టు) పంటకు మార్కెట్లో డిమాండ్ ఉందని, డిమాండ్‌ను బట్టి రైతులు మల్బరీ సాగును పెంచాలన్నారు. సాగుసమయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తమను సంప్రదించాలన్నారు. పట్టు పంటను సాగు చేసే రైతులకు ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వినోద్‌కుమార్ యాదవ్, అధికారులు రాఘవేంద్ర, మునిరత్నంరెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పాండు రంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిశెట్టి, రైతులు ఖాజమియా, గౌసొద్దీన్, మల్లిఖార్జున్, నసీరొద్దీన్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బైక్‌పై గంజాయి రవాణా.. నిందితుడి అరెస్ట్

రామచంద్రాపురం, జూలై 9: బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు పట్టుకుని, అతని నుంచి 1.110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రాపురం ఎస్‌ఐ నర్సింహులు కథనం ప్రకారం.. ఒడిస్సాకు చెందిన సరోజ్‌కుమార్ (41) పటాన్ చెరులో ఉంటూ, కూలీలకు గంజాయి అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం బండలగూడకు గంజాయి తరలిస్తుండగా, నిందితుడిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సరోజ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.


23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గజ్వేల్, జూలై 9: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్న సాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలోని వీరేశ్ కుమార్ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో అక్రమంగా బియ్యాన్ని నిలువ ఉంచారన్న సమాచారంతో సోమవారం రాత్రి గజ్వేల్ సీఐ సైదా ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

చుంచనకోటలో 13 క్వింటాళ్లు

చేర్యాల, జూలై 9: చేర్యాల మండలం చుంచనకోట గ్రామం మీదుగా అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. పట్టణ శివారులో తనిఖీ చేస్తున్న క్రమంలో వాహనాన్ని పట్టుకున్నామని తెలిపారు.

అల్ప్రాజోలం పట్టివేత.. ఇద్దరి అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

మెదక్ అర్బన్, జూలై 9: అక్రమంగా అల్ప్రాజోలం తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పిల్లికోటాల్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా, వెల్దుర్తి మండల పరిధిలోని మంగళపర్తి గ్రామానికి చెందిన సాయికాంత్‌గౌడ్, కలాన్ శెట్టిపల్లి గ్రామా నికి చెందిన అంజాగౌడ్‌లను అరెస్టు చేసి వారి వద్ద 160 గ్రాముల అల్ప్రాజో లం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నూతన చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఎస్ఐ బాలయ్య, సిబ్బంది చంద్రయ్య , ఎల్లయ్య, రాజు, నరేష్, హరీష్, రవి, నవీన్ పాల్గొన్నారు.

బడుల్లో సగం పనులే..!

● బిల్లు తీసుకుని వదిలేసి వెళ్లిన కాంట్రాక్టర్
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
● ఇదీ.. మన ఊరు మన బడి తీరు

మనోహరాబాద్, జూలై 9: మన ఊరు మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు సాగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా వదిలేశారు. మండల కేంద్రంలోని మనోహరాబాద్, దండుపల్లితో పాటు పలు పాఠశాలల్లో పనులు ప్రారంభించి వదిలేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం మన ఊరు మన బడి పథకం కింద పలు పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా దండుపల్లి పిట్టలవాడలోని ప్రాథమిక పాఠశాలకు రూ. 2 లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. అయితే, ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సగం బిల్లులు తీసుకుని, పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. పాఠశాలలో సంపు, బాత్‌రూంల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, మధ్యలోనే వదిలేశాడు. తలుపులు తీసుకొచ్చినా బిగించలేదు. సంపుపై మూతలు లేకపోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయమై కాంట్రాక్టర్ సుధాకర్‌ను సంప్రదించగా, మండలంలోని పలు పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు.



మూతలేని సంపు



కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లిన తలుపులు

సగం బిల్లు తీసుకున్నారు..



దండుపల్లి పిట్టలవాడ ప్రాథ మిక పాఠశాలలో రెండునెలల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రెండు లక్ష లకుపైగా నిధులు మంజూరు కాగా, రూ. లక్ష బిల్లు తీసుకున్నారు. ఆ తర్వాత పనులు వదిలేసి వెళ్లిపోయారు. ఫోన్ చేసినా స్పందించడం లేదు. పాఠశాల సంపు, బాత్‌రూంలు, డోర్లు ఎక్కడివక్కడ వదిలేసి వెళ్లారు.

-అన్వర్ జహానా, ఉపాధ్యాయురాలు

అధ్వానంగా ఉంది..



పాఠశాలలో సగం పనులు చేసి వదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. పాఠశాల డోర్లు, విద్యుత్ మీటర్, సంపు, కిటికీల మరమ్మతులు పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలేసి వెళ్లారు.

-జై ప్రకాశ్, ఉపాధ్యాయుడు



సంగాయిపేటలో తాడుతో కట్టేసి ఉన్న యువకుడు

పొలం గట్టు పంచాయతీలో కట్టేసి కొట్టారు..

కొల్చారం, జూలై 9: మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలో పొలం గట్టు పంచాయితీ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య దాడుల్లో ఒకరిని చెట్టుకు కట్టేసి కొట్టారు. మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొకిరె మల్లయ్య, జెల్ల మల్లయ్యలకు మెదక్-జోగిపేట ప్రధాన రహదారి పక్కనే వ్యవసాయ భూములు ఉన్నాయి. కొంతకాలంగా వీరి మధ్య గెట్టు పంచాయతీ నడుస్తోంది. మంగళవారం జెల్ల మల్లయ్య పొలం హద్దును మొకిరి మల్లయ్య చెరిపేసే ప్రయత్నం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మొకిరె మల్లయ్య కర్రతో జెల్ల మల్లయ్య తలపై కొట్టడంతో రక్తం కారింది. ఈ విషయం తెలిసి జెల్ల మల్లయ్య కుమారుడు బాలరాజు వచ్చి అక్కడే ఉన్న మొకిరె మల్లయ్య కుమారుడు మొకిరె నర్సింహులును దగ్గరలోనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రి ఇనుప పైపులకు తాడుతో కట్టేసి కర్రలతో చితకబాదాడు. విషయం తెలిసి ఏఎస్సై తారాసింగ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి తాళ్లతో కట్టేసిన యువకుడిని విడిపించారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువురి పిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహ్మద్ గౌస్ తెలిపారు.

భూతగాదాల్లో ఇరువురి మధ్య ఘర్షణ

ఒకరికి గాయాలు



మనోహరాబాద్, జూలై 9: భూతగాదాల్లో ఇరువురి మధ్య ఘర్షణ లో ఒకరు గాయపడ్డారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వర్గంటి సాయికిరణ్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి సొంత గ్రామమైన కాళ్లకల్‌లోనే నివసిస్తున్నారు. సాయికిరణ్ రెడ్డికి గ్రామంలోని సర్వే నంబర్ 492లో తాతల నుంచి వారసత్వంగా 8 గుంటల భూమి వచ్చిందని మంగళవారం తండ్రికొడుకులు పొలం వద్దకు వెళ్లారు. అయితే, ఆ భూమిలో అప్పటికే కబ్జాలో క్రిష్ణరెడ్డి ఉండగా, ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో క్రిష్ణరెడ్డి, అతని కూమారుడు భరత్‌రెడ్డి, మల్లారెడ్డిని, అతని కూమారుడు వర్గంటి సాయికిరణ్‌రెడ్డిలపై చేతులు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. గాయపడిన మల్లారెడ్డిని ఆస్పత్రిలో చేర్పించిన సాయికిరణ్‌రెడ్డి ఈ మేరకు పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని ఒడి.. 'అస్తబల్' గుడి

● ప్రకృతి కోవెలలో కొలువు తీరిన రేణుకా ఎల్లమ్మ తల్లి
● ఆలయానికి ఆషాఢమాసం సందడి

సంగారెడ్డి అర్బన్, జూలై 9 : ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు గ్రామ దేవతల ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోతాయి. బోనాల జాతర మొదలవుతుంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇంట్లో వాళ్లంతా ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నెలరోజుల పాటు సంగారెడ్డి పట్టణంలోని అస్తబల్ ప్రాంతం సందడిగా మారుతున్నది. ఫలపరిశోధన కేంద్రమైన అస్తబల్ వివిధ రకాల వృక్షాలతో ప్రకృతి రమణీయ ప్రదేశంగా విలసిల్లుతున్నది. ఇక్కడ కొలువైన రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు కుటుంబసమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులవుతారు. మహిళలు బోనం నివేదిస్తారు. కోడిపిల్లలు, మేక పిల్లలను బలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. తమను కాపాడమని సుఖ సంతోషాలతో ఉండేలా దీవించమని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుంటారు. అస్తబల్‌కు వెళ్లేందుకు ముందు భక్తులు పట్టణంలోని నల్లపోచమ్మ తల్లి ఆలయంతో పాటు తాళ్లపల్లి రోడ్డులోని దుర్గామాతను దర్శించుకుని నైవేద్యాలు సమర్పిస్తారు.

భోజనాలకు అనుమతి లేదు

నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు అస్తబల్‌లోని పచ్చని ప్రకృతిలో పెద్దలు, పిల్లలు సేదతీరేందుకు అవకాశం ఉన్నప్పటికీ నాలుగేళ్లుగా వనభోజనాలు చేసేందుకు ఫలపరిశోధన అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఫలితంగా భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే ఆషాఢమాసంలో అయినా వనభోజనాలకు అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.



అస్తబల్‌లోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయం

మల్లన్నరైల్వే స్టేషన్ పనులను త్వరగా ప్రారంభించాలి

● కేంద్ర సహాయమంత్రి 'బండి'కి నాయకుల వినతి



బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కొమురవెల్లి నాయకులు

చేర్యాల, జూలై 9: కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం పనులు త్వరితగతిన ప్రారంభింపజేయాలని కోరుతూ బీజేపీ కొమురవెల్లికి చెందిన నాయకులు మధు తదితరులు మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన జరిపి నెలలు గడిచినా అతీగతీలేవని, వెంటనే ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే యేటా సుదీర్ఘకాలం బ్రహ్మోత్సవాలు జరిగే మల్లన్న ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రసాద్ పథకంలో చేర్చాలని, మల్లన్న భక్తుల ఇక్కట్లు తీర్చాలని కోరారు. దీంతో మంత్రి సంజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు.

ఎంపీని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, జూలై 9: మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గజ్వేల్ నియోజకవర్గానికి మొదటిసారి వచ్చిన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్ప బొకేను అందజేసి ఆహ్వానం పలికారు. వారితో ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు షైన రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, నాయకులు ఉబ్బని ఆంజనేయులు, శనిగారి రమేశ్, నర్సింలు, కరుణాకర్ తదితరులున్నారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన బస్టాండ్లను పూర్తి చేయాలి

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌లో నిలిచిపోయిన బస్‌బే వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రతాప్‌రెడ్డి, నాయకులు

గజ్వేల్, జూలై 9: అర్ధాంతరంగా నిలిచిపోయిన బస్టాండ్లను పూర్తి చేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో నిలిచిపోయిన బస్‌బే వద్ద మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పనులను పరిశీలించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, పథకాల కింద దాదాపు రూ.200 కోట్లను గతంలోని కేసీఆర్ ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆ నిధులను వెనక్కి తీసుకొని గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ బస్టాండ్ అసంపూర్తి నిర్మాణ పనులకు మంజూరైన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్, రోడ్డు మధ్యలో డివైడర్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, పార్టీ మండలాధ్యక్షుడు బెండ మధు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్‌అలీ, శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, దుర్గాప్రసాద్, రహీం తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో ఎస్సీ హాస్టల్ కొనసాగేనా..?

మద్దూరు, జూలై 9: మద్దూరు మండల కేంద్రంలో మూతపడిన ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించి చిన్నకోడూరు మండల కేంద్రంలోని హాస్టల్ వార్డెన్‌ను ఇన్‌చార్జి వార్డెన్‌గా నియమించారు. వార్డెన్‌తో పాటు సిబ్బంది, విద్యార్థులను హాస్టల్‌కు రప్పించేందుకు పలు పాఠశాలలతో పాటు దూళిమిట్ట మండలంలోని కొండాపూర్ తండాలు, కూటిగల్, మద్దూరు మండలంలోని నర్సాయపల్లి పిట్టల గూడెం, ధర్మారం పిట్టలగూడెంతో పాటు పలు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ అక్కడక్కడా బ్యానర్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నా రాత్రిళ్లు బస చేసేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా మోడల్ స్కూల్‌లోని సుమారు 25 మంది విద్యార్థులు హాస్టల్‌లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న సమయంలో ఇన్‌చార్జి వార్డెన్ డిప్యూటేషన్ రద్దు చేసినట్లు సమాచారం. కొత్త వార్డెన్ నియామకం వరకు సిబ్బందిని చూసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఏది ఏమైనా ఈ ప్రాంత పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి వసతిగృహాన్ని ఉన్నతాధికారులు వినియోగమయ్యేలా చూడాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మద్దూరులోని ఎస్సీ వసతి గృహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన విజయ్‌కుమార్

నంగునూరు, జూలై 9: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో మంగళవారం జరిగింది. రాజగోపాలపేట పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లా పరకాల గ్రామానికి చెందిన విజయ్‌కుమార్(40) సిద్దిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్లో పనిచేస్తున్నాడు. రోజువారీగా హుస్నాబాద్ నుంచి సిద్దిపేటకు బైక్‌పై వస్తున్న క్రమంలో బద్దిపడగ బస్టాండ్ వద్ద ట్యాంకర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్‌చేయగా.. అంబులెన్స్ మెడికల్ టెక్నీషియన్ గుండెల్లి రమేష్, డ్రైవర్ బాలరాజు వచ్చి ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ విజయ్‌కుమార్ మృతిచెందాడు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లు తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



బావిలో తాడు పట్టుకున్న శ్రీశైలం

చేర్యాల, జూలై 9: కల్లు తాగడం కోసం డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన మొగుళ్ల శ్రీశైలం కొన్నాళ్లుగా కల్లుకు బానిసగా మారాడు. ఈ క్రమంలో తరచూ కొండపాక మండలం లకుడారం గ్రామంలోని కల్లు దుకాణానికి వెళ్లి కల్లు తాగిన అనంతరం సీసాలు వెంట తెచ్చుకునేవాడు. మంగళవారం కల్లుకు డబ్బులు ఇవ్వాలని కుటుంబసభ్యులను అడగడంతో వారు నిరాకరించారు. దీంతో క్షణికావేశానికి లోనై తమ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. బావిలోంచి అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు తాళ్ల సహాయంతో శ్రీశైలంను సురక్షితంగా బయటకు తీశారు. మరోసారి ఇలా చేయొద్దంటూ గ్రామస్థులు శ్రీశైలంను మందలించారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● నాలుగు బైక్‌లు స్వాధీనం



బైకులను స్వాధీనం చేసుకున్న టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, జూలై 9: సిద్దిపేట టూటౌన్ పోలీసులు బైకులు చోరీ చేసే వ్యక్తిని అరెస్టు చేశారు. టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేందర్ వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ (టీఎస్ 09 ఈఈ 5206) నెంబరు గల స్కూటీని ఇంటి ముందు పార్కు చేశాడు. రాత్రి 11 గంటలకు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకుపోయారు. దీంతో శ్రీనివాస్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా మంగళవారం సీఐ తన సిబ్బందితో కలిసి రంగీలా దాబా వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఖబోజు రమేష్ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు. 2023లో సిద్దిపేట వన్ టౌన్ పరిధిలో మూడు బైకులు, టూ టౌన్ పరిధిలో ఒక బైకును దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు పంపించామన్నారు.

సమాచారం

'ఈటల'ను కలిసిన బీజేపీ నాయకులు

కోహెడ, జూలై 9: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం, బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, బీజేవైఎం నాయకుడు రాగుల రాజు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి మెమెంటోలతో సత్కరించారు.

ఇసుక డంపును పట్టుకున్న పోలీసులు

అక్కన్నపేట, జూలై 9: అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామ శివారులోని రంగారెడ్డి స్థలంలో మంగళవారం సాయంత్రం అక్రమంగా డంపు చేసిన 40 టన్నుల ఇసుకను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకున్నారు.

ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించాలి

మద్దూరు, జూలై 9: మూడునెలలుగా ఉపాధిహామీ కూలీలకు కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ మండలాధ్యక్షుడు పాకాల ఇసాక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మస్టర్లలో చేసిన పనిదినాలను ఎంటర్ చేయడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి కూలీ డబ్బులు చెల్లించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సెటిల్‌మెంట్లకు పాల్పడితే చర్యలు తప్పవు: ఎస్ఐ

చేర్యాల, జూలై 9: సస్పెక్ట్‌షీట్ జాబితాలో ఉన్న వ్యక్తులు భూతగాదాల్లో కానీ, సెటిల్‌మెంట్లలో కానీ తలదూర్చకూడదని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ హెచ్చరించారు. కొమురవెల్లి మండలానికి చెందిన పలువురు సస్పెక్ట్‌షీట్‌దారులతో కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ చేశారు.

కృతజ్ఞతా సభకు నాయకులు

మర్కుక్, జూలై 9: మెదక్ ఎంపీగా గెలుపొందిన రఘునందన్‌రావు తన గెలుపుకు సహకరించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో గజ్వేల్‌లోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కృతజ్ఞతా సభ నిర్వహించారు. ఈ సభకు మర్కుక్ మండలం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు.

వయస్సుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలి

● సీడీపీవో జయమ్మ



పోతారం(ఎస్)లో గ్రోత్‌మేళాలో మాట్లాడుతున్న సీడీపీవో జయమ్మ

హుస్నాబాద్‌రూరల్, జూలై 9: పిల్లల వయస్సుకు తగ్గ బరువు ఉండే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సీడీపీవో జయమ్మ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రోత్‌మేళాకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు తగిన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు జి రజిత, స్వరూప, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయాల సేవలు మరువలేనివి

రాయపోల్, జూలై 9: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు ఆయాలు చేసే సేవలు మరువలేనివని రాయపోల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షబానా పేర్కొన్నారు. రాయపోల్-4 అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయా సావిత్రి పదవీ విరమణ సందర్భంగా.. ఆమెను శాలువాతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భాస్కర్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, స్థానిక ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్: అంజిరెడ్డి



ములుగులో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి

ములుగు, జూలై 9: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులో పార్టీ మండలాధ్యక్షుడు జహంగీర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సొంత ప్రయోజనాలు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ యువత ఉపాధ్యక్షుడు జుబేర్, గ్రామ కమిటీ అధ్యక్షులు విల్లాసాగర్, బాలరాజ్, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● బీజేపీ నాయకుల డిమాండ్



బెజ్జంకిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెజ్జంకి, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుభరోసా కింద ఖరీఫ్, రబీలకు కలుపుకుని రూ.15 వేలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, రాములు, మహేందర్, రామచంద్రం, రవి, శంకర్, వెంకటేశం, కనకయ్య, రాజిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి ప్రతిపక్షాలకు లేదు'

ములుగు, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి ప్రతిపక్షాలకు లేదని యూత్ కాంగ్రెస్ గజ్వేల్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ములుగు మండలం వంటిమామిడిలో విలేకరుల సమావేశంలో అన్నసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఒరగపెట్టింది ఏమీలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి అందరూ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని, ఒక ప్రతిపక్ష పార్టీ పాలకులకే సరిగ్గా కనబడడం లేదని హెచ్చరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. లేని యెడల ప్రతిపక్షాలను గ్రామాల్లో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు.

'పాడి రైతుల బిల్లులు చెల్లించాలి'



ములుగులో పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

ములుగు, జూలై 9: నాలుగు నెలల పాల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని విజయ డైరీ పాల రైతు సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పాల బిల్లులు సమయానికి అందించారని, ఈ ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాల బిల్లు డబ్బులు చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేనియెడల రహదారిపై ధర్నా చేయడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, పరశురాం, మహేష్, సతీష్, అశోక్, స్వామి పాల్గొన్నారు.

శ్రీవాణి విద్యాలయంపై చర్యలు తీసుకోవాలి

● పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్

దుబ్బాక, జూలై 9: దుబ్బాకలోని శ్రీవాణి విద్యాలయం నిర్లక్ష్యంతో విద్యార్థులకు రక్షణ కరువైందని, ఆ విద్యాలయపై చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, నాయకులు తునికి సురేష్, గోపి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల వద్ద తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. సోమవారం పాఠశాలకు వచ్చిన జాస్విక అనే ఎల్‌కేజీ చిన్నారిని.. వేరొక పేరెంట్ గార్డినెన్స్‌తో పంపించారన్నారు. తమ కూతురు ఇంటికి రాలేదని ఆందోళనకు గురైన సదరు చిన్నారి తల్లిదండ్రులు యాజమాన్యాన్ని అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఎలాంటి రక్షణ లేని పాఠశాలకు విద్యాధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే ఈ పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ బబ్బూరి రజిత

గజ్వేల్, జూలై 9: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ బబ్బూరి రజిత అన్నారు. మునిసిపల్ పరిధిలోని 6వ వార్డులో డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై, దోమల పట్ల వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వార్డులో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అత్యవసర పరిస్థితి ఉంటే 104 లేదా 100 నెంబర్లకు సంప్రదించాలని, మునిసిపల్ సిబ్బందికి తెలియజేయాలని కౌన్సిలర్ సూచించారు. వారితో ఎపిడెమిక్ సభ్యులు వాసుదేవ్, డి.నాగరాజు, దుర్గాగౌడ్, రమేశ్, ఆశావర్కర్లు అమృత, పద్మ, భావన ఉన్నారు.

గ్రామాల్లో పీర్ల పండుగ సందడి



చిన్నకోడూరులో నెలకొల్పిన పీరీలు

చిన్నకోడూరు, జూలై 9: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల (మొహరం) పండుగ సందడి గ్రామాల్లో ప్రారంభమైంది. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లోని ముస్లింలు పీర్లను సోమవారం రాత్రి నెలకొల్పారు. తొమ్మిది రోజుల పాటు పీర్ల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తొగుట, జూలై 9: తొగుట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో యాదవరెడ్డి పేర్కొన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు స్థానికులైన మహిళలు ఏడవ తరగతి చదివిన వారై ఉండి, 300 మందికి వంట చేయగల సామర్థ్యం, అనుభవం కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళలు 10 నుంచి 16వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, అనుభవం కలిగిన ధ్రువీకరణ పత్రాలను జతపరిచి కేజీబీవీ తొగుట పాఠశాలలో అందజేయాలని సూచించారు. దరఖాస్తులను స్వీకరించిన తర్వాత ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి అర్హులైన మహిళలను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు నడపడం నేరం

● సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి



ట్రాన్స్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న మద్యం

మర్కుక్, జూలై 9: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాప్‌లు నిర్వహించడం చట్టరీత్యా నేరమని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేష్‌పల్లి గ్రామ చౌరస్తాలో స్వర్గం శ్రీనివాస్ తన కిరాణాషాపులో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాప్ నడుపుతున్నాడని నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీసులతో కలిసి దాడిచేశారు. బీర్లు, విస్కీ, లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ కమిటీ కార్యవర్గ ఎన్నిక

చేర్యాల, జూలై 9: ఆర్యవైశ్య మహాసభ చేర్యాల పట్టణ కమిటీ కార్యవర్గ ఎన్నిక మంగళవారం పట్టణంలో జరిగింది. అధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్ ఎన్నికవగా, గౌరవాధ్యక్షుడిగా మంచాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల నాగరాజు, కోశాధికారిగా తేరాల శ్రీనివాస్, పీఆర్‌వోగా శేరి బాలనారాయణ, ఉపాధ్యక్షులుగా అయిత రవీందర్, పిన్న వీరమల్లయ్య, యాంసాని బాలనారాయణ, యాంసాని లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా పెద్ద రమేశ్, మాంకాల రాజు, పుసనాల వీరేశం, గందె నర్సయ్య, సభ్యులుగా పిన్న రాజమౌళి, మంచాల నారాయణ, పడకంటి ఉమాపతి, కందుకూరి చంద్రశేఖర్, అయిత శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట పద్మ, యువజన సంఘం అధ్యక్షుడిగా ఒరుగంటి శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

సిద్దిపేట అర్బన్, జూలై 9: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని 12న జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఫ్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఐదేళ్ల నుంచి విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం తీరుగా వ్యవహరిస్తుందన్నారు. 12న చేపట్టే కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, నాచారం శేఖర్, చెప్యాల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

'రైతుభరోసా' ఇవ్వకపోవడం బాధాకరం

● పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు

కోహెడ, జూలై 9: వ్యవసాయ పనులు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఇంతవరకూ ప్రభుత్వం నుంచి రైతులకు పెట్టుబడి కోసం ఇచ్చే రైతుభరోసా ఇవ్వకపోవడంతో బాధాకరమని పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుభరోసా పేరుతో ప్రతి రైతుకూ ఎకరానికి రూ.7,500, అలాగే కూలీలకు రూ.6 వేల చొప్పున ఇస్తామని చెప్పి.. ఇప్పటివరకూ అమలు చేయడం లేదన్నారు. వరి నార్లు నాటుకు వచ్చినా నాట్లు వేయడానికి డబ్బులు లేక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వం స్పందించి రైతుభరోసా డబ్బులు వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సిద్ధప్ప వరకవి జయంతి



గుండారెడ్డిపల్లి గ్రామంలో సిద్ధప్ప వరకవి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

కోహెడ, జూలై 9: మండలంలోని గుండారెడ్డిపల్లిలో సిద్ధప్ప వరకవి 121వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధప్ప ఆశ్రమంలో ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు, శిష్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన రాసిన గ్రంథాల్లోని పద్యాలు, పాటలు చదువుతూ భజనలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఇందులో సిద్ధప్ప కుమారుడు మాణిక్యలింగం, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, శిష్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ ఫొటో మార్ఫింగ్‌పై ఫిర్యాదు

మద్దూరు, జూలై 9: ఫేస్‌బుక్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఫొటో మార్ఫింగ్ చేసి పెట్టిన పోస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ యూత్ ధూళిమిట్ట మండలాధ్యక్షుడు బడుగు సాయిలు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఫొటో మార్ఫింగ్ చేసి.. బీరు సీసాలతో కూడిన కుర్చీలో కూర్చున్నట్టు ఫొటో పెట్టిన ఆదిత్యాచౌదరి రాయుడుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ మద్దూరు మండలాధ్యక్షుడు గూడ రవీందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.